
## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



5 లో


# మనం



కృష్ణా / గుంటూరు

ఎన్‌టీఆర్ - బాపట్ల - పల్నాడు



బుధవారం | 16 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 11


## గణపతి ఆశీస్సులు...
# అందరిపై ఉండాలి



**సాగర తీర మహాగణపతిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్**
**మంగినపూడి సాగర తీరంలో 63 అడుగుల సప్తమృత్తిక విజయగణపతికి ప్రత్యేక పూజలు**

పి.మీరాహుస్సేన్ ఖాన్

8 లో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మంగళవారం మంగినపూడి సాగర తీరంలో ఏర్పాటు చేసిన మహాగణపతి ఉత్సవాలకు హాజరై 63 అడుగుల సప్తమృత్తిక విజయగణపతిని దర్శించుకున్నారు. విజయవాడ నుంచి మంగళవారం సాయంత్రం రోడ్డు మార్గంలో మంగినపూడి బీచ్‌కు చేరుకున్న గవర్నర్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర గవర్నర్, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని విజయ గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు గవర్నర్‌కు ఆశీర్వచనాలు అందించారు.

-విజయవాడ, మనంబ్యూరో







5 లో

## జీవనోపాధి మెరుగుదలకు సమగ్ర
# కార్యాచరణ రూపొందించాలి

మత్స్య రంగంలో పీతల పెంపకం అధిక ఆదాయం

జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

## క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యల
# పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

6 లో



దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రతి సమస్యకు కాలపరిమితి నిర్దేశించుకుని పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ సి యం.సాయి కాంత్ వర్మ

## మట్టి వినాయకుని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**కోడూరు ఎస్సై చాణిక్య**

కోడూరు,మనం న్యూస్ 15ః ఉల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ భక్తులకు విగ్రహాలను అందజేసిన ఎస్సై చాణిక్య మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని కోడూరు ఎస్సై కే. చాణిక్య అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని సోమవారం కోడూరు గ్రామానికి చెందిన ఉల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎస్సై చాణిక్య హాజరై భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి విగ్రహాలను వినియోగించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించేందుకు ముందుకు రావాలని సూచించారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి వినాయక చవితి సందర్భంగా ఉల్లి వెంకటేశ్వరరావు భక్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమని ఎస్సై చాణిక్య ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాలని ఆకాంక్షించారు. 200 మంది భక్తులకు మట్టి విగ్రహాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు యద్దనపూడి గోపాలకృష్ణ, ముద్దినేని చంద్రరావు, యార్లగడ్డ ఓంకార్ ఉల్లి వెంకటేశ్వరరావు అన్నం శివరామకృష్ణ మల్ల వెంకటేశ్వరరావు ఇంకొల్లు అశోక్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 7,900 ఎంఏహెచ్ భారీ బ్యాటరీతో రెడ్మీ 17 5జీ



గాంధీనగర్ సెప్టెంబర్ 15 మనం న్యూస్: 7,900 ఎంఏహెచ్ భారీ బ్యాటరీతో రూపొందించిన రెడ్మీ 17 5జీ స్మార్ట్‌ఫోన్ అమ్మకాలను షావోమీ ఇండియా ప్రారంభించింది. రోజువారీ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ ఫోన్లో స్నాప్‌డ్రాగన్ 4 జనరేషన్ 5 మొబైల్ వేదికను అందించారు. 17.53 సెం.మీ. అంటే 6.9 అంగుళాల హెచ్డీ ప్లస్ తెరను కలిగి ఉండగా, 120 హెర్ట్జ్ వరకు అనుకూల సమకాలీకరణ, 825 నిట్స్ వరకు ప్రకాశం లభిస్తుంది. రెండు స్టీరియో స్పీకర్లు, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ రక్షణను అందించారు. 45 వాట్ల వేగవంతమైన ఛార్జింగ్తో పాటు 22.5 వాట్ల వరకు వైర్డ్ రివర్స్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. షావోమీ హైపర్‌ఓఎస్ 3 ఆధారంగా పనిచేసే ఈ ఫోన్లో 5జీ అనుసంధానం, ఐపీ64 రక్షణ, 2 టెరాబైట్ల వరకు నిల్వ సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశం, పక్క భాగంలో వేలిముద్ర గుర్తింపు, కృత్రిమ మేధ ఆధారిత ముఖ గుర్తింపు వంటి సదుపాయాలు ఉన్నాయి. ఫొటోల కోసం రాత్రి, చిత్రపటం, హెచ్డీఆర్, పత్రాల చిత్రీకరణ విధానాలతో 50 మెగాపిక్సెల్ కృత్రిమ మేధ ద్వంద్వ కెమెరా, ముందు భాగంలో 8 మెగాపిక్సెల్ కెమెరా ఉన్నాయి. నలుపు, నీలం, నారింజ రంగుల్లో లభిస్తుంది. 6జీబీ, 128జీబీ నమూనా ధర రూ.23,999 కాగా, 8జీబీ, 128జీబీ నమూనా ధర రూ.26,999గా నిర్ణయించారు.

## ఏషియన్ గేమ్స్‌కు ఒలింపియన్ ప్రణతి

గాంధీనగర్ సెప్టెంబర్ 15 మనం న్యూస్: భువనేశ్వర్లోని ఒడిశా ఏఎం/ఎన్ఎస్ ఇండియా జిమ్నాస్టిక్స్ హై పెర్ఫార్మెన్స్ సెంటర్లో శిక్షణ పొందుతున్న ఒలింపియన్ ప్రణతి నాయక్ ఈ నెల 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్లోని ఐచి-నగోయాలో జరగనున్న 20వ ఆసియా క్రీడలు-2026కు భారత జిమ్నాస్టా ఎంపికయ్యారు. ఈ క్రీడలకు ఎంపికైన ఏకైక భారత జిమ్నాస్ట్ ప్రణతి కావడం విశేషం. కళాత్మక జిమ్నాస్టిక్స్లో మహిళల వాల్ట్, మహిళల ఆల్‌రౌండ్ విభాగాల్లో ఆమె పోటీపడనున్నారు. 2026లో తాష్కెంట్లో జరిగిన అంతర్జాతీయ జిమ్నాస్టిక్స్ సమాఖ్య ప్రపంచ ఛాలెంజ్ కప్లో మహిళల వాల్ట్ విభాగంలో రజత పతకం సాధించడంతో పాటు, 54వ అఖిల భారత రైల్వే జిమ్నాస్టిక్స్ ఛాంపియన్షిప్లో స్వర్ణ పతకం సాధించడం ప్రణతి ఎంపికకు దోహదపడింది. టోక్యో-2020 ఒలింపిక్స్లో భారత్కు ప్రాతినిధ్యం వహించిన ఆమె జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో నిరంతరం మెరుగైన ప్రదర్శనలు చేస్తోంది. 2025లో ఆసియా కళాత్మక జిమ్నాస్టిక్స్ ఛాంపియన్షిప్స్, అంతర్జాతీయ పరికరాల ప్రపంచకప్లో కాంస్య పతకాలు సాధించింది. 38వ జాతీయ క్రీడల్లో స్వర్ణం, రజతం, కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. ప్రణతి ఎంపికపై ఏఎం/ఎన్ఎస్ ఇండియా డైరెక్టర్, మానవ వనరులు, పరిపాలన విభాగం ఉపాధ్యక్షుడు అషుతోష్ తెలంగ్ అభినందనలు తెలిపారు. అత్యున్నత స్థాయిలో పోటీపడేందుకు అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు, అథ్లెట్ సహకారాన్ని అందిస్తూ భారత జిమ్నాస్టిక్ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని ఆయన తెలిపారు.

## పలు వినాయక విగ్రహాలని సందర్శించి, విరాళాలు అందజేసిన లంక లితీష్



మైలవరం సెప్టెంబర్ 15 మనం న్యూస్ : స్థానిక మండలం లోని పలు సెంటర్ల నందు వినాయక చవితి సందర్భంగా ఏర్పా టు చేసిన వినాయకుని మండపాలను నియోజక వర్గ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆశీస్సులతో సందర్శించి, పూజా కార్యక్రమంలో పాల్గొని, 5000 రూపాయ లు విరాళాలను అందజేసి న, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ జల్లి కృష్ణ, నాయకులు, కార్యకర్తలు తెలుగు యువత, పాల్గొన్నారు.

## భక్తి, ప్రకృతి అనుబంధమే వినాయక పందిరి



గాంధీనగర్, సెప్టెంబర్ 15(మనం న్యూస్): వినాయక పందిరి భక్తి భావానికి, ప్రకృతి అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వేముల చారిటీస్ చైర్మన్ వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. పందిరి అలంకరణలో ఉపయోగించే పూలు, పండ్లు, ఆకులు, గరిక వంటివి విశ్వ సృష్టికి, ప్రకృతి సమృద్ధికి ప్రతీకలుగా భావిస్తారని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో గణేష్ ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ప్రజల మధ్య మానవ సంబంధాలు మరింత బలపడే అవకాశాలు ఉన్నాయన్నారు. గాంధీనగర్ స్వామి స్ట్రీట్లోని నరసింహ నివాస్ వద్ద ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మహోత్సవ పందిరిలో పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. సంస్థ ప్రధాన కార్యదర్శి యల్లాప్రగడ శేఖర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షులు శీలంశెట్టి మాణిక్యాలరావు, కార్యదర్శి ఎలిశెట్టి అనిల్ కుమార్, హిమశ్రీ కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యవర్గ సభ్యులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శేఖర్, మాణిక్యాలరావు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 19వ తేదీన అన్నదానంతో పాటు ఘనంగా వినాయకుడి ఊరేగింపు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో దైవభక్తి, దేశభక్తి, ఐక్యతను పెంపొందించేందుకు లోకమాన్య బాల గంగాధర తిలక్ బహిరంగ వినాయక ఉత్సవాల సంప్రదాయాన్ని పెద్ద ఎత్తున ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారని వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు.

## వన్ రైడ్ 2026లో పాల్గొనేందుకు నమోదు చేసుకోండి

గాంధీనగర్ సెప్టెంబర్ 15 మనం న్యూస్: రాయల్ ఎన్ఫీల్డ్ నిర్వహిస్తున్న వార్షిక ప్రపంచ మోటార్సైక్లింగ్ వేడుక 'వన్ రైడ్ 2026'లో ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది రైడర్లు పాల్గొననున్నారు. 2011లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఒకే రోజున వివిధ దేశాలు, ఖండాలకు చెందిన రైడర్లను ఏకం చేస్తోంది. రాయల్ ఎన్ఫీల్డ్ 125వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది 60 దేశాల్లో 1,600కు పైగా రైడ్లు జరగనున్నాయి. ప్రతి రైడర్. ప్రతి రహదారి. ఒకే లక్ష్యం అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ ఏడాది రైడ్లు హిమాలయాల్లోని కీలక జాతి అయిన మంచు చిరుత సంరక్షణకు అంకితం చేశారు. 'వన్ రైడ్ 2026'లో పాల్గొనే ప్రతి రైడర్ తరఫున మంచు చిరుత సంరక్షణకు రాయల్ ఎన్ఫీల్డ్ విరాళం అందించనుంది. రాయల్ ఎన్ఫీల్డ్ సోషల్ మిషన్ ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్, లడఖ్, ఉత్తరాఖండ్, సిక్కిం, జమ్మూ కాశ్మీర్ ప్రాంతాల్లో ఇప్పటికే సంరక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులు 10,500 చదరపు కిలోమీటర్లకు పైగా మంచు చిరుత ఆవాసాలను కవర్ చేస్తున్నాయి. ప్రస్తుతం భారతదేశంలో సుమారు 718 మంచు చిరుతలు ఉన్నట్లు సంస్థ తెలిపింది. ఢిల్లీ, లండన్, సావో పాలో తదితర ప్రాంతాల్లో పాల్గొనే రైడర్లు ఈ సంరక్షణ కార్యక్రమానికి తోడ్పడనున్నారు. ఆసక్తి ఉన్న వారు సమీప రాయల్ ఎన్ఫీల్డ్ డీలర్షిప్ లేదా ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య ను ఆదర్శంగా తీసుకోవాలి



మైలవరం సెప్టెంబర్ 15 మనం న్యూస్ : స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రఖ్యాత ఇంజనీర్ సర్ భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే వేడుకలను యస్. యస్. యస్, సివిల్ మరియు స్పూర్తి క్లబ్ వారి ఆధ్వర్యం లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.అప్పారావు మాట్లాడు తూ ఇంజనీర్లు తమ ఆలో చనలకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చా రు. భారత దేశంలోనూ, మన రాష్ట్రంలోనూ మేకిన్ ఇండియా స్ఫూర్తి ఊపందు కుంటున్న ఈ తరుణంలో సమాజానికి, దేశానికి ఊతం ఇచ్చే ఆవిష్కరణలు రావలిసిన అవసరం ఉంద ని తెలిపారు. అతి సాధారణ స్థాయి లో ఉద్యోగ జీవితాన్ని ఆరంభిం చి తన ప్రతిభతో, ఆలోచన లతో నీటి పారుదల రంగం లో విశిష్ట సేవలందించి, భారత ప్రభుత్వంలో 'భారత రత్న'బిరుదును, బ్రిటిష్ గవర్నమెంటు నుండి 'సర్' బిరుదును అందుకున్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం యువ ఇంజనీర్లకు ఆదర్శప్రాయం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్రమాన్ని తొలుత మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాల వేశా రు. అనంతరం స్పూర్తి క్లబ్ వారు క్విజ్, పోస్టర్ ప్రెసెంటే షన్ వంటి పోటీలను నిర్వహించి వాటిలో గెలు పొందిన విద్యార్థిని విద్యార్థు లకు బహుమతులను అందచేశారు. ఈ కార్య క్రమంలో డీన్స్, సివిల్ విభాగాధిపతి కే.వెంకట రమణ, యన్.యస్.యస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి. శివహరి ప్రసాద్, ఎస్.ఉమా మహేశ్వ ర రెడ్డి , స్పూర్తి క్లబ్ కో ఆర్డినేటర్ కె. శ్రీదేవి మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165 వ జయంతి



**▸▸ బెంగాల్ నవల రచయిత శరత్ చంద్ర చటోపాధ్యాయ 150 వ జయంతి**

నందిగామ,సెప్టెంబర్ 15(మనం న్యూస్): నందిగామ శాఖ గ్రంథాలయము నందు బెంగాల్ నవల రచయిత శరత్ చంద్ర చటోపాధ్యాయ 150 వ జయంతిని మరియు భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165 వ జయంతిని ఘనంగా నిర్వహించారు.గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు శరత్ చంద్ర చటోపాధ్యాయ చిత్రపటానికి, ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు గోపాలకృష్ణ, షేక్ శ్రీను, విద్యార్థులు పాల్గొని పుష్పాలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి రామచంద్రుడు మాట్లాడుతూ శరత్ చంద్ర చటోపాధ్యాయ 1876 సెప్టెంబర్ 15న జన్మించినారని, ఈయన రాసిన నవలలు దేశ వ్యాప్తంగా చాలా భాషల్లో అనువదించినారని, మన తెలుగు భాషలో చరత్ సాహిత్యం పేరు మీద రాసినారని, ఈయన రాసిన దేవదాసు నవల ఆధారంగా దేవదాసు సినిమా తీసినారని, ఆడపిల్లల వృత్తాంతంగా ఎన్నో నవలలు రాసినారని గ్రంథాలయ అధికారి తెలియజేసినారు, మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1876 సెప్టెంబర్ 15 అన్న జన్మించినారని, ఈయన జయంతినే ఇంజనీరింగ్ డేగ భారత ప్రభుత్వం ప్రకటించినది, తిరుమల ఘాట్ రోడ్ ప్లానింగ్, హైదరాబాదులో మూసినది వరద ప్రభావం నుండి కాపాడటం, కావేరి నదిపై కృష్ణ సాగర్ ప్రాజెక్టు నిర్మించడం ఇటువంటి ఎన్నో ఆనకట్టలు ప్లానింగ్ ఇచ్చి నిర్మించినారని గ్రంథాలయ అధికారి తెలియజేసినారు.

## వెయ్యికి పైగా సర్వీస్ టచ్పాయింట్లకు ఏఐప్లస్ స్మార్ట్‌ఫోన్




గాంధీనగర్ సెప్టెంబర్ 15 మనం న్యూస్: ఏఐప్లస్ స్మార్ట్ఫోన్ భారతదేశంలో అమ్మకాల తర్వాత సేవలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా తన సర్వీస్ నెట్వర్కును 1,000కు పైగా సర్వీస్ సెంటర్లకు విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఉన్న 800కు పైగా సర్వీస్ సెంటర్లకు అదనంగా 200కు పైగా కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ఈ దీపావళి సందర్భంగా ఢిల్లీలో ఏఐప్లస్ తన తొలి ప్రత్యేక సర్వీస్ సెంటర్ను ప్రారంభించనుంది. ఇందులో శిక్షణ పొందిన సాంకేతిక నిపుణులు, అసలైన విడిభాగాలు, ప్రామాణిక మరమ్మతులు, సాఫ్ట్వేర్ సహాయం, వారంటీ సేవలు, పరికరాల సెటప్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. సమస్య స్వభావాన్ని బట్టి సాధారణ సర్వీస్లను అదే రోజు నుంచి గరిష్ఠంగా ఏడు రోజుల్లో పరిష్కరించేందుకు సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే సమయంలో ఏఐ+ అసిస్టెన్స్ యాప్ను కూడా పరిచయం చేస్తోంది. దీని ద్వారా పరికరం, వారంటీ వివరాలను తెలుసుకోవడం, సమీప సర్వీస్ సెంటర్ను గుర్తించడం, సర్వీస్ బుకింగ్, టికెట్ నమోదు, ట్రాకింగ్, ట్రబుల్షూటింగ్ సహాయం వంటి సేవలను ఒకే వేదికపై పొందవచ్చు. నెక్స్ట్‌క్వాంటమ్ షిఫ్ట్ టెక్నాలజీస్ సీఈఓ మాధవ్ షేత్ మాట్లాడుతూ, వినియోగదారుల యాజమాన్య ప్రయాణం మొత్తం విశ్వసనీయమైన మద్దతు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

# దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేసిన ఇంజనీరింగ్ పితామహుడు విశ్వేశ్వరయ్య

**▸▸ ఆయన స్ఫూర్తితో ఏపీని కరువురహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర జలవిధానంతో ప్రతి ఎకరాకు సాగునీరు**

**▸▸ ఇంజనీర్ల సేవలు దేశ ప్రగతికి పునాదులు: మాజీ జల వనరుల మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు**



గొల్లపూడి ,సెప్టెంబర్ 15(మనం న్యూస్): ప్రపంచం గర్వించదగిన ప్రఖ్యాత ఇంజనీర్గా, భారతావనికి ఎనలేని సేవలందించిన మహనీయుడిగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. భారతీయ ఇంజనీరింగ్ రంగంలో శిఖర సమానులు, భారతరత్న డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా గొల్లపూడిలోని తన కార్యాలయంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇంజనీర్లందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తన మేధోశక్తి, ఇంజనీరింగ్ నైపుణ్యం, దూరదృష్టితో దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేసిన నవభారత నిర్మాత విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. నీటి వనరుల అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, వరద నియంత్రణ, పారిశ్రామిక అభివృద్ధి వంటి అనేక రంగాల్లో విశ్వేశ్వరయ్య అందించిన సేవలు దేశానికి మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్న మమకారంతో హైదరాబాద్లో మూసీ నది వరదల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఆయన అందించిన ఇంజనీరింగ్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ను కరువురహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర జలవిధానాన్ని అమలు చేస్తున్నారని దేవినేని ఉమా తెలిపారు. నదుల అనుసంధానం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తిచేయడం, నీటి వనరుల సమర్థ వినియోగం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తమ మేధోశక్తితో మానవ మనుగడకు ఎన్నో ఫలాలను అందిస్తూ, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజనీర్ల సేవలు వెలకట్టలేనివని అన్నారు. భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మిస్తున్న ఇంజనీర్లందరికీ ఇంజనీర్స్ డే సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విశ్వేశ్వరయ్య వంటి మహనీయుల స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

## భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం

**▸▸ వీరంకి వీరాస్వామి**



నందిగామ,సెప్టెంబర్ 15(మనం న్యూస్): ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం, నందిగామ మండలం కంచల గ్రామంలో భారతరత్న ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా వీరంకి వీరాస్వామి నివాళులర్పించినారు.ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన విజ్ఞానం, నిబద్ధతతో సమాజ అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆలోచనలు, సేవా స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల పాత్ర ఎంతో కీలకమని, యువత శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా ముందుకు సాగాలని వీరాస్వామి పిలుపునిచ్చారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వీరంకి వీరాస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల రాధాకృష్ణమూర్తి, శ్రవణం కృష్ణమూర్తి చనమల స్వామి, రామిరెడ్డి ఎలమందయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొండూరు అంగనవాడి కేంద్రంలో పోషణ మాసోత్సవాలు

**▸▸ పోషకాహార ప్రాముఖ్యత గురించి తెలుపుతున్న సూపర్‌వైజర్ తారాబి**

నందిగామ,సెప్టెంబర్ 15(మనం న్యూస్): పోషకాహారాలు తీసుకోవడం వల్ల పరిపూర్ణ ఆరోగ్యం.. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని నందిగామ మండలం కొండూరు అంగనవాడి కేంద్రం, నందిగామ పట్టణం బీసీ కాలనీ, లింగాలపాడు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం సిడిపిఓ లక్ష్మీ భార్గవి పర్యవేక్షణలో సూపర్వైజర్లు షేక్ తారాబి, ఇషాత్, శ్రీదేవి లు తొమ్మిదవ జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఆయా అంగనవాడి కేంద్రాల్లో ఆరు రకాల చిరుధాన్యాలు పోషకాహారాలపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగాసూపర్వైజర్లు మాట్లాడుతూ ఆకుకూరలు కూరగాయలు పాలు గుడ్లు చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యం సమకూడుతుందని.. ప్రోటీన్ తగ్గటం వల్ల పిల్లలు ఎదుగుదల బరువు లోపిస్తుందని వివరించారు.. ఆయా అంగన్వాడి కేంద్రాల్లో పోషకాలు కలిగిన ఆరు రకాల చిరుధాన్యాలు ఆకుకూరలు పాలు గుడ్లు, గింజలు పప్పు దినుసులు ఆహార వంటకాలపై ప్రదర్శన ద్వారా తల్లులు గర్భవతులు బాలింతలకు అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు గర్భవతులు బాలింతలు తల్లులు పాల్గొన్నారు.



## సీనియర్ న్యాయవాదిపై కేసు నమోదును నిరసిస్తూ న్యాయవాదుల ఆందోళన




**▸▸ విధులు బహిష్కరించి, గాంధీ విగ్రహం వద్ద నిరసన. ఏసీపీకి వినతిపత్రం**

నందిగామ, సెప్టెంబర్ 15(మనం న్యూస్): నందిగామ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది బండి మల్లికార్జునరావుపై కంచికచర్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన తీరును నిరసిస్తూ నందిగామ బార్ అసోసియేషన్కు చెందిన న్యాయవాదులు మంగళవారం తమ విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్కు చేరుకుని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదిపై అక్రమంగా కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ పోలీసుల తీరును ఖండించారు. న్యాయవాదుల హక్కులను, న్యాయవృత్తి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసు అధికారులపై ఉందని పేర్కొన్నారు. అనంతరం న్యాయవాదులు ర్యాలీగా వెళ్లి నందిగామ ఏసీపీ సీహెచ్. శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. బండి మల్లికార్జునరావుపై కంచికచర్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడానికి దారితీసిన పరిస్థితులు, కేసు నమోదు చేసిన విధానం తదితర అంశాలపై సమగ్రంగా విచారణ జరిపించాలని వారు ఏసీపీని కోరారు. న్యాయవాదిపై నమోదు చేసిన కేసును పునఃపరిశీలించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, న్యాయవాదులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నందిగామ బార్ అసోసియేషన్కు చెందిన పలువురు న్యాయ వాదులు పాల్గొన్నారు.

# ఎనిమిదో రోజుకు చేరిన కోనేరు ఆక్రమణ రిలే నిరాహార దీక్షలు



**నందిగామ,సెప్టెంబర్ 15(మనం న్యూస్):** రామలింగేశ్వర స్వామి వారి ఆలయ కోనేరు పుష్కరిణి ఆక్రమణ తొలగించాలని హిందూ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. నందిగామ పట్టణం శుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలో గింజుపల్లి అనిల్,కొత్త సాంబశివరావు, మునగంటి కామేశ్వరరావు,గంట వెంకట్రావు,మొరిశెట్టి చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనేరు పుష్కరిణి ఆక్రమణల తొలగింపు పై అధికారులు నిర్లక్ష్యం వీడి హైకోర్టు తీర్పును గౌరవిస్తూ స్వామివారి కోనేరు పుష్కరిణి ఆక్రమణ తొలగింపు పై వెంటనే చర్యలు చేపట్టాలని హిందూ సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. ఈ దీక్ష కార్యక్రమంలో బండారు కేదార్నాథ్ శర్మ, తులసి కృష్ణ, నూతక్కి విజయ్, పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు ధార్మిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు

**నందిగామ,సెప్టెంబర్ 15(మనం న్యూస్):** వినాయకచవితి సందర్భంగా పున్నవల్లి గ్రామంలో, గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తాన్ని తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం అందిస్తున్నారు. ఈకార్యక్రమంలో పున్నవల్లి, వెలది కొత్తపాలెం, చందర్లపాడుకు చెందిన 30 మంది యువకులు రక్తదానం చేశారు. విజయవాడకు చెందిన స్త్రమల్ బ్లడ్ సెంటర్ ఈ కార్యక్రమంకు సహకారం అందించారు. రక్తదానం మీద అపోహలను పోగొట్టి దాని వల్ల కలిగే ప్రయోజనాలని తెలియజేయటం మరియు అవసరమైన వారికి రక్తాన్ని అందించటం ఈ కార్యకంనిద్దేశం అని పన్నవల్లి గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల పోలింగ్ జాబితా విడుదల

**నందిగామ,సెప్టెంబర్ 15(మనం న్యూస్):** ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల నిర్వహణ లో భాగంగా నందిగామ పట్టణం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ మరియు జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణ నిమిత్తం నందిగామ మండలానికి సంబంధించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల చేసినట్టు ఎంపీడీవో ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. సదరు పోలింగ్ స్టేషన్ల జాబితాలపై అభ్యంతరాలు సూచనలు ఉన్నచో 16వ తేదీ గురువారం లోపు ఎంపీడీవో కు అందజేయాలని తెలిపారు. నందిగామ మండలంలో మొత్తం 39,224 మంది ఓటర్లు ఉన్నారు,14 గ్రామాలఎంపీటీసీ జడ్పీటీసీల ఎన్నికలకు సంబంధించి 47 పోలీస్ స్టేషన్లో ఉండగా. పోలింగ్ స్టేషన్లో సగటు ఓటరు సంఖ్య సుమారు 835 మంది కలిగి ఉన్నదని ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు.

## హనుమాన్ జంక్షన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్ డే

**▸▸ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం ఆదర్శం కావాలి : లయన్స్ ప్రెసిడెంట్ మత్తి**



**హనుమాన్ జంక్షన్: సెప్టెంబర్ 15 ( మనం న్యూస్ ):** ప్రఖ్యాత ఇంజనీర్ సర్ బారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా హనుమాన్ జంక్షన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంజనీర్స్ డే ఘనంగా నిర్వహించారు. మౌలిక వసతుల కల్పనలో అభివృద్ధిలో ఇంజనీర్లు అందించే సేవలే ముఖ్యమని ఆధునిక సమాజ నిర్మాణానికి ఇంజనీర్లు సారథులని హనుమాన్ జంక్షన్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మత్తి సాంబశివరావు అన్నారు.లయన్స్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే సందర్భంగా వివిధ రంగాల్లో ప్రజలకు సేవలు అందించిన ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. విద్యుత్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి రైతులకు ఇతోదిక సేవలందించిన లయన్, ఇంజనీర్,పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వీరమాచినేని రామబ్రహ్మం ను లయన్స్ నాయకులు ఘనంగా సన్మానించారు.అలాగే పోలవరం కాలువ ద్వారా రైతులకు సేవలందిస్తున్న ఏ ఇ గోపికృష్ణ ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అక్కినేని రాఘవేంద్రరావు, కోశాధికారి మత్తి రాంబాబు,సీనియర్ లయన్స్ నాయకుడు మేడికొండ బుచ్చిబాపయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లేపల్లి నారాయణరావు, గూడపాటి రత్న శేఖర్,అక్కినేని శ్రీనివాస పణీంద్ర, నండూరి సత్య వెంకటేశ్వర శర్మ,నందిగం స్వామి,చలసాని వెంకటేశ్వరరావు, బోయపాటి పూర్ణచంద్రరావు,తుమ్మల నారాయణరావు, మాకినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ ఏపీసీపీడీసీఎల్లో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు





**విజయవాడ,15 సెప్టెంబర్,(మనం న్యూస్):** ఇంజనీర్ల ఆలోచనలు - దేశ ప్రగతికి పునాదులని ఎండీ పి. పుల్లారెడ్డి అన్నారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను విజయవాడలోని ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఇంజనీర్లకు ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం, సాంకేతిక అభివృద్ధి, విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలను స్వీకరిస్తూ విద్యుత్ రంగాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు విద్యుత్ భద్రత, సరఫరా నాణ్యత, అంతరాయాల నివారణకు ఇంజనీర్లు మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రమశిక్షణ, నిజాయితీ, సాంకేతిక నైపుణ్యం, దేశ సేవా స్ఫూర్తి ప్రతి ఇంజనీర్కు ఆదర్శమని సీఎండీ పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో విద్యుత్ రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇంజనీర్ల ఆలోచనలు - దేశ ప్రగతికి పునాదులు అనే స్ఫూర్తితో నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యుత్ రంగంలో మరింత ప్రగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇంజనీర్గా వివిధ విశిష్ట పదవుల్లో సేవలందించి, ప్రస్తుతం ఏపీసీపీడీసీఎల్ సీఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్న పి. పుల్లారెడ్డిను ఇంజనీరింగ్ అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ హెచ్ఆర్డీ టీవీఎస్ఎన్ మూర్తి, ఇతర ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగులు పాల్గొని ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.




# గుంటూరు నగర కీర్తిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన కమిషనర్ మయూర్ అశోక్ కి ఘన సత్కారం



**గుంటూరు నగరపాలక సంస్థ సెప్టెంబర్ :15 (మనం న్యూస్ ప్రతినిధి ):** వాయు కాలుష్య నియంత్రణలో విశేష ప్రతిభ కనబరిచి, కేంద్ర పర్యావరణ శాఖ నిర్వహించిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 లో గుంటూరు నగరం జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం, అలాగే పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఏకకాలంలో 25 వేల మంది విద్యార్థులచే 25 వేల మట్టి గణపతి విగ్రహాలను తయారు చేయించి, 'వరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్,లండన్ లో గుంటూరు నగరం పేరు



నమోదు అయ్యేలా కృషి చేసిన నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ ని మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో పలు స్వచ్ఛంద సంస్థలు, యూనియన్ల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు పి.శివప్రసాద్, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ వి.వెంకట నాగిరెడ్డి, ది మునిసిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈ.మధుబాబు, మరాఠా రాష్ట్ర సంఘం అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు కమిషనర్ ని కలిసి,పర్యావరణ హితంగా పూల మొక్కలు అందజేసి,శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు. గుంటూరు నగరాన్ని స్వచ్ఛ, సుందర నగరంగా తీర్చిదిద్దడంలో కమిషనర్ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు,చూపుతున్న చొరవ అభినందనీయమని, రాబోయే రోజుల్లో గుంటూరును మరిన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని వివిధ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డ్, గ్రీన్ గణేష్ తో వరల్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధనలో సిబ్బంది,అధికారుల కృషితో పాటు ప్రజా ప్రతినిధుల సహకారం,ప్రజల భాగస్వామ్యం కీలమన్నారు. రానున్న కాలంలో గుంటూరు నగరపాలక సంస్థ చేసే కార్యక్రమాల్లో మరింతగా భాగస్వాములు కావాలని కోరారు.





# వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు: ఎస్పీ

**గుంటూరు సెప్టెంబర్ :15 (మనం న్యూస్ ప్రతినిధి )**పోలీస్ అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్.వినాయక చవితి సందర్భంగా పోలీస్ అధికారులు,సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలు, విగ్రహాల వద్ద భద్రతా చర్యలపై డీఎస్పీలు,ఎస్హెచ్ఓలతో సమీక్ష. వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 1.55 గంటల నుండి 2.55 గంటల వరకు జిల్లాలోని డీఎస్పీలు, ఎస్హెచ్ఓలతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి వినాయక విగ్రహాల ఏర్పాటు,పూజా కార్యక్రమాలు,నిమజ్జనం తదితర అంశాలపై సమీక్షించారు.సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి.సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాల్లో డీజేలకు అనుమతి ఇవ్వకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు.ఇతర ప్రాంతాల్లో కూడా పోలీసుల సూచనలకు అనుగుణంగా పరిమిత శబ్దంతో కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలని, రాత్రి 10 గంటలలోపు వేడుకలను ముగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ అధిక శబ్దంతో డీజేలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుని, అవసరమైతే డీజే పరికరాలను సీజ్ చేయాలని ఆదేశించారు.ప్రతి వినాయక విగ్రహం వద్ద తప్పనిసరిగా ఇసుక, నీటి సదుపాయం అందుబాటులో ఉండేలా నిర్వాహకులకు సూచించాలని తెలిపారు.రాత్రి వేళల్లో విగ్రహాల వద్ద భద్రత కోసం నిర్వాహకులు/కమిటీ సభ్యుల్లో కొంతమంది అక్కడే ఉండేలా చూడాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన గ్రామాలు, ప్రాంతాలను కలుపుతూ బీట్ పెట్రోలింగ్ నిర్వహించి, రోజుకు కనీసం ఒకటి లేదా రెండుసార్లు తనిఖీలు చేయాలని ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనలు జరగకుండా ఎస్హెచ్ఓలు సిబ్బందితో ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని సూచించారు. సమస్యాత్మక విగ్రహాలు, ప్రాంతాలపై ప్రత్యేక నిఘా. గతంలో గొడవలు జరిగిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఎస్హెచ్ఓలు ప్రతిరోజూ స్వయంగా పర్యటించి పరిస్థితులను సమీక్షించాలని ఎస్పీ ఆదేశించారు. సంబంధిత విగ్రహాల నిర్వాహక కమిటీ సభ్యులను ,సమస్యలకు కారణమయ్యే వ్యక్తులను ముందస్తుగా బైండ్ ఓవర్ చేయాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, పట్టణంలోని సమస్యాత్మక వార్డులను స్పెషల్ బ్రాంచ్ ద్వారా గుర్తించి,ఆయా ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎస్పీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్ ని ఎస్పీ ఆదేశించారు. అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు వినాయక చవితి



ప్రారంభం నుండి విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యే వరకు తమ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు ,విగ్రహాల వద్ద పరిస్థితులను క్లోజ్ మానిటరింగ్ చేయాలని సూచించారు.నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి.వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతానగర్ ఘాట్, కుంచనపల్లి బ్రిడ్జి,అలాగే చేబ్రోలు ప్రాంతంలోని బకింగ్ హాం కాలువ వద్ద అవసరమైన భద్రతా,ట్రాఫిక్ మరియు ఇతర ఏర్పాట్లను ప్రభుత్వ శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పోలీస్ శాఖ తరపున అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**గుంటూరు, సెప్టెంబర్ 15(మనంప్రతినిధి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ మంగళవారం పరిశీలించారు. తుళ్లూరు మండలం అబ్బురాజు పాలెంలో ఈ నెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదిత పర్యటన ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.డి.ఏ అదనపు కమీషనర్ ఎ.భార్గవ్ తేజ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అదనపు ఎస్పీ ఎ.టి.వి రవి కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, రహదారులు భవనాలు శాఖ కార్యనిర్వహక ఇంజనీర్ సి.విశ్వనాథరెడ్డి, పాల్గొన్నారు.

# నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించిన బలసాని



**గుంటూరు సెప్టెంబర్ :15 (మనం న్యూస్ ప్రతినిధి):** ప్రత్తిపాడు నియోజకవర్గం, గుంటూరు రూరల్ మండలం,ఏటుకూరు బైపాస్ రోడ్డులో గల, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు 'వినాయక చవితి' ప్రత్యేక సందర్భంగా,ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి, 'విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని అనుగ్రహంతో నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు మరియు అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించిన,ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త' బలసాని కిరణ్ కుమార్'ఈ కార్యక్రమంలో,ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# జీవనోపాధి మెరుగుదలకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలి



- **జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

**మచిలీపట్నం, సెప్టెంబర్ 15,(మనం న్యూస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుని జిల్లాలో ప్రజలకు మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్లో డీఆర్డీఏ, పరిశ్రమలు, మత్స్య, ఉద్యాన, బ్యాంకింగ్, ఎల్ఐసీ తదితర శాఖల అధికారులతో జీవనోపాధి మెరుగుదలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు, నిరుద్యోగ యువత, రైతులు, మత్స్యకారులు తదితరులకు ఆదాయ మార్గాలు కల్పించడంపై చర్చించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఎల్ఐసీ పాలసీలపై అవగాహన కల్పించడంతో పాటు, ఆహార శుద్ధి రంగంలో సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ శిక్షణ కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. మత్స్య రంగంలో పీతల పెంపకం వంటి అధిక ఆదాయ కార్యకలాపాలను ప్రోత్సహించడంతో పాటు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా లబ్ధిదారులకు అందే అవకాశాలను విస్తృతంగా వినియోగించుకోవాలన్నారు.అలాగే మిల్కీ మష్రూమ్ సాగు, బయోచార్ యూనిట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించి, ఆసక్తి ఉన్న వారికి అవసరమైన శిక్షణ, సాంకేతిక సహాయం, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలను అనుసంధానం చేయాలని, మంజూరైన యూనిట్లు గ్రౌండ్ అయ్యేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఆసక్తి వ్యక్తం చేసిన వారి వివరాలను సేకరించి, వారికి సంబంధిత శాఖల ద్వారా అవసరమైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందించాలని సూచించారు.జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, ప్రభుత్వ పథకాలు, శిక్షణా సంస్థలు, ఆర్థిక సహాయాన్ని సమన్వయం చేసి ఉపాధి కల్పించడమే కాకుండా ప్రజలను స్వయం ఉపాధి, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా ఈ నెల 17వ తేదీన కలెక్టరేట్లో నిర్వహించనున్న ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్ కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమీక్షలో డిఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిల, డీఆర్డీఏ పీడీ హరిహరినాథ్, ఉద్యాన శాఖ అధికారిణి జె జ్యోతి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, ఎల్డీఎం సి రవీంద్రారెడ్డి, మత్స్యశాఖ జేడీ అయ్యా నాగరాజా, ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ నాగేశ్వరరావు, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ స్వర్ణ శ్రీ తదితర అధికారులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ప్రాంతాల్లో 15 వేల కేజీల పూజా వ్యర్థాల సేకరణ

- **నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు**
- **కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ,సెప్టెంబర్,15,(మనం న్యూస్):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నగరంలోని వివిధ నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.నిమజ్జన ప్రాంతాల్లో పూజా వ్యర్థాలను ఎప్పటికప్పుడు సేకరించి, వేరుచేసేందుకు ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ప్రకాశం బ్యారేజ్ 2 క్రేన్లు ఏర్పాటుచేసి వినాయకుని నిమజ్జనం చేస్తున్నామని తెలిపారు, 12 మంది పారిశుధ్య కార్మికులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, నిమజ్జనం సందర్భంగా వచ్చే పూలు, పూజా సామగ్రి తదితర వ్యర్థాలను ఎప్పటికప్పుడు వేరుచేసి సేకరిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పున్నమి ఘాట్ వద్ద 10 మంది, భవానీ ఘాట్ వద్ద 10 మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.నగరంలోని వివిధ నిమజ్జన ప్రాంతాల్లో పూజా వ్యర్థాల నిర్వహణను పర్యవేక్షించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం పర్యటిస్తున్నాయని కమిషనర్ తెలిపారు. ఇప్పటివరకు సుమారు 15,000 కేజీల పూజా వ్యర్థాలను సేకరించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా నగరంలోని కాలువల వద్ద బ్యారిగేట్లను ఏర్పాటు చేసి, ప్రజలు నీటిలో ఎలాంటి పూజా వ్యర్థాలను వేయకుండా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నీటిలో అనుకోకుండా కలిసిపోయిన వ్యర్థాలను కూడా ట్రక్సర్ మెషిన్ల సహాయంతో ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.సేకరించిన పూల వ్యర్థాలను వినియోగించి అగరబత్తులు, ధూప్ స్టిక్స్ వంటి ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు, ఇతర పూజా వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసి సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు పూజా వ్యర్థాలను కాలువలు, జల వనరుల్లో వేయకుండా నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన సిబ్బందికి అందజేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు.



# గుంటూరు నగరంలో గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా పనిచేయాలి



**గుంటూరు నగర పాలక సంస్థ సెప్టెంబర్ :15 (మనం న్యూస్ ప్రతినిధి)** గుంటూరు నగరంలో గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా పనిచేయాలని, అన్ని రోడ్లలోని పాట్హోల్స్ యుద్ధప్రాతిపదికన పూడ్చాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ విద్యా నగర్,వికాస్ నగర్, జేకేసి కాలేజీ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి,అభివృద్ధి, పారిశుధ్య పనులను తనిఖీ చేసి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,వర్షాల నేపథ్యంలో నగరంలోని ప్రధాన రహదారులు,లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిలవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై పాట్ హోల్స్ మరమత్తుకు తక్షణ అనుమతులు ఇస్తున్నాచేయించడంలో ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేస్తూ, అటువంటి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.టెండర్లు పూర్తయి వర్క్ ఆర్డర్లు పొందినా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు వెంటనే నోటీసులు జారీ చేసి,సదరు వర్క్ లను రద్దు చేయాలని ఆదేశించారు. రహదారులు, డ్రెయిన్ల పక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ సామాగ్రిని వేస్తే తక్షణమే సీజ్ చేయాలని, ఉల్లంఘనలు పునరావృతమైతే సంబంధిత నిర్మాణాలకు వర్క్ స్టాప్ ఆర్డర్లు ఇవ్వాలని స్పష్టం చేశారు.పర్యటనలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ,ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్ బాబు,ఈఈ విష్ణు వర్ధన్,డిఈఈ వెంకటరమణ,ఎస్ఎస్ సోమశేఖర్,ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక,ఇంజినీరింగ్ అధికారులు,సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజలకు నిరంతర విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- జగ్గయ్యపేటలో నూతన 33 కేవీ విద్యుత్ లైన్ ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)
- రూ.కోటి వ్యయంతో విద్యుత్ లైన్ ఏర్పాటు
- పలు ప్రాంతాలకు 24 గంటల విద్యుత్ సరఫరాకు మార్గం సుగమం



జగ్గయ్యపేట సెప్టెంబర్ 15 మనం న్యూస్: ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించటంతో పాటు పారిశ్రామిక ,వాణిద్య ,మరియు గృహ అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయటమే ప్రభుత్వ లక్ష్యం అని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. పట్టణంలోని చిల్లకల్లు రోడ్డులో ఆర్ డి ఎస్ ఎస్ పథకం కింద రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన 33 కేవీ విద్యుత్ లైన్ను జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇండస్ట్రియల్ ఫీడర్ నుంచి సుమారు 2 కిలోమీటర్ల మేర 33 కేవీ విద్యుత్ లైన్ను తొర్రగుంటపాలెం సబ్స్టేషన్కు అనుసంధానం చేశారు. ఈ నూతన లైన్ అందుబాటులోకి రావడంతో తొర్రగుంటపాలెం సబ్స్టేషన్ పరిధిలోని తొర్రగుంటపాలెం, విద్యానగర్, ధనంబోర్డు, ఆర్టీసీ కాలనీ, కాకాని నగర్, చిల్లకల్లు మెయిన్ రోడ్డు, కె.అగ్రహారం, ముక్త్యాల, పద్మావతి నగర్ పంప్ హౌస్ తదితర ప్రాంతాలకు మరింత నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య మరియు గృహ అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నూతన 33 కేవీ లైన్తో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గి, 24 గంటల విద్యుత్ సరఫరాకు మరింత మెరుగైన అవకాశాలు ఏర్పడతాయని ఎమ్మెల్యే రాజగోపాల్ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘువేంద్ర,12 వ వార్డు కౌన్సిలర్ వేదులాపురి అలేఖ్య సైదా, తాళ్లూరి వెంకటేశ్వర రావు, మల్లెబోయిన జ్వాలా, పెంటేల పూర్ణయ్య, కళ్యాణం సూర్య ప్రకాష్, కాకుమాను కన్నయ్య,వంకాయలపాటి బ్రహ్మం మరియు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు

- పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన వైఎస్ఆర్ సీపీ నాయకులు

జగ్గయ్యపేట: సెప్టెంబర్ 15 మనం న్యూస్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. జగ్గయ్యపేట పట్టణ పార్టీ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. జగ్గయ్యపేట పట్టణంలోని నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి తన్నీరు నాగేశ్వరరావు కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న వృద్ధులు, రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని రోడ్లపై జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులకు ఆహారాన్ని పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. తన్నీరు నాగేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తన్నీరు నాగేశ్వరరావు కి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




# క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ప్రతి సమస్యకు కాలపరిమితి నిర్దేశించుకుని పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ సి యం.సాయి కాంత్ వర్మ

గుంటూరు, సెప్టెంబర్ 15 (మనం ప్రతినిధి): ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా,పారదర్శకంగా అందేలా ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. యం.సాయి కాంత్ వర్మ స్పష్టం చేశారు.రాష్ట్ర స్థాయిలో ఇటీవల నిర్వహించిన కలెక్టర్స్ కాన్ఫరెన్స్లో చర్చించిన అంశాలు, ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతలు, జిల్లాలో వాటి అమలుపై జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ లోని విసి హాల్లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖకు చెందిన అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సామాజికంగా ఎక్కువ ప్రభావం చూపే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి సమస్యకు స్పష్టమైన కాలపరిమితిని నిర్దేశించుకుని, నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలు, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన అంశాలపై సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా దృష్టి సారించి పనిచేయాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించడం,వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమన్నారు.అలాగే జిల్లాలోని ప్రతి శాఖకు సంబంధించిన ప్రధాన పనితీరు సూచికల పురోగతి వివరాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్కు ఎప్పటికప్పుడు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు జిల్లాలో ఉన్నాయని కలెక్టర్ పేర్కొంటూ, అయితే వాటిలో క్రియాశీలంగా లేని యూనిట్లను గుర్తించి, వాటి పరిస్థితిని పరిశీలించి తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు, ఆర్థిక కార్యకలాపాలు మరింత పెరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లా అంతటా సంవత్సరం పొడవునా గ్రీన్ కవర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పచ్చదనం పెంపొందించేందుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి,మొక్కల పెంపకం, సంరక్షణ,పచ్చదనం అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయాలని సూచించారు. -ఆఫీస్ ద్వారా ఫైళ్ల నిర్వహణ.పరిపాలనా ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఫైళ్లు ఈ-ఆఫీస్ ద్వారానే రావాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఫైళ్ల కదలికలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని,నిర్ణీత సమయంలోగా ఫైళ్లను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పాఠశాలలు స్టార్ రేటింగ్స్లో ముందంజలో ఉండాలి.జిల్లాలోని అన్ని పాఠశాలలు స్టార్ రేటింగ్స్లో ముందంజలో ఉండేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు,మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన రేటింగ్ సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ నివారణకు పటిష్ట చర్యలు.టీనేజ్ ప్రెగ్నెన్సీని నివారించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. బాలికల ఆరోగ్యం,విద్య,భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న బాలికలను ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన కౌన్సెలింగ్, ఆరోగ్య సేవలు, రక్షణ,సహాయాన్ని అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులు తగ్గేలా సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు.అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.జిల్లాలోని అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రతను పటిష్టం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.హాస్టళ్లలో మౌలిక వసతులు, పరిశుభ్రత,భోజనం, భద్రత తదితర అంశాలను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు.ఈ సమావేశం లో గుంటూరు నగర పాలక సంస్థ కమీషనర్ మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, డి ఆర్ ఓ షేక్ ఖాజావలి,అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ముక్త్యాల గ్రామంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు





**దశావతార మూర్తి అవతారంలో దర్శనమిస్తున్న బ్రదర్స్ యూత్ వినాయకుడు**

**జగ్గయ్యపేట సెప్టెంబర్ 15 మనం న్యూస్:** జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల గ్రామంలో బ్రదర్స్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రదర్స్ యూత్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది 14 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దశావతార మూర్తి అవతారంలో కొలువుదీరిన వినాయకుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. వినాయక చవితి తొలి రోజు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ పూజా కార్యక్రమాలకు గ్రామంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రదర్స్ యూత్ సభ్యులంతా అన్నదమ్ముల్లా ఐకమత్యంతో ఉంటూ ప్రతి సంవత్సరం నవరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ గ్రామంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న బ్రదర్స్ యూత్, ఈ ఏడాది మరింత రెట్టింపు ఉత్సాహంతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గ్రామ ప్రజల సహకారంతో భక్తి, ఐకమత్యం, సేవాభావంతో నిర్వహిస్తున్న ఈ వేడుకలు నవరాత్రుల పాటు మరింత వైభవంగా కొనసాగనున్నాయి.

# పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి పోషకాహారం అందించాలి



**సిడిపిఓ లక్ష్మీ భార్గవి**

**కంచికచర్ల సెప్టెంబర్ 15(మనం న్యూస్):** సరైన పోషకాలున్న సమతుల్య ఆహారాన్ని తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని, పిల్లలలో సరైన పెరుగుదల సాధ్యపడుతుందని ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీ భార్గవి సూచించారు. 9వ పోషణ్ పక్వాడ కార్యక్రమాలలో భాగంగా కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామంలో అంగన్వాడి కేంద్రాలను సిడిపిఓ లక్ష్మీ భార్గవి మంగళవారం సందర్శించారు. ఆరు ఆహార వర్గాల ధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పులు, కూరగాయలు పండ్లు, గింజలు విత్తనాలు, పాలు గుడ్లు, వినియోగంపై ప్రదర్శన ఇవ్వటం జరిగింది. సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ పిల్లలకు ప్రతిరోజు ఇచ్చే ఆహారంలో వైవిధ్యంతో పాటు ప్రతి ముద్దలో పోషణ ఉండేలా చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, సీజనల్ కూరగాయలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. సరైన ఆహారాన్ని తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని, పిల్లలలో సరైన పెరుగుదల సాధ్యపడుతుందని తెలిపారు. పోషక ఆహారం, ప్రేమతో కూడిన సంరక్షణ, మెదడును చైతన్యపరిచే ఆటపాటలు పిల్లల సమగ్ర అభివృద్ధికి చాలా ముఖ్యమని తెలిపారు. అందుబాటులో వున్న ప్రోటీన్ వనరులపై తల్లులకు కౌన్సిలింగ్ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ శారద, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సమష్టిగా సిద్ధం కావాలి

**దొంతిరెడ్డి వేమారెడ్డి**



**తాడేపల్లి,సెప్టెంబర్,15,(మనం న్యూస్):** దుగ్గిరాల మండలంలో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షులు తాడిపోయిన శివగోపయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సభను ఉద్దేశించి దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను అందించడం సంతోషకరమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీలో ఎటువంటి విభేదాలకు తావు లేకుండా నాయకులు, కార్యకర్తలు అందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి గ్రామం లో పార్టీని బలోపేతం చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయా లని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో జానీబాషా నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు, ఫిలోమిన నియోజకవర్గ మహిళా అధ్యక్షులు, సంసూనమ్మ మండల మహిళా అధ్యక్షులు,కాంతరావు జిల్లా టిఛి సెల్ అధికార ప్రతినిధి, శృంగార పాటి రత్నం మండ ల టిఛి సెల్ అధ్యక్షులు, మరియు మండల, గ్రామ అధ్యక్షులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు తదిత రులు పాల్గొన్నారు.

# రైతుపై ఫ్యాక్టరీ యాజమాన్యం దౌర్జన్యం

**రేకుల షెడ్డును కూల్చివేత**

**కంచికచర్ల సెప్టెంబర్ 15(మనం న్యూస్):**ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామం లో ఓ రైతుకు ఫ్యాక్టరీ యాజమాన్యం తీరని అన్యాయం చేసింది. నిస్సహాయ రైతు అయిన మార్కపూడి సీతయ్యకు చెందిన రేకుల షెడ్డును సెంట్రిని ఫ్యాక్టరీ యాజమాన్యం అక్రమంగా కూలగొట్టింది.సొంత స్థలంలో వేసుకున్న షెడ్డును, ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, ఏకపక్షంగా జేసీబీలతో కూల్చివేయడంతో రైతు కుటుంబం రోడ్డున పడింది. తన జీవనోపాధి కోసం ఎంతో కష్టపడి నిర్మించుకున్న షెడ్డును క్షణాల్లో నేలమట్టం చేయడంతో రైతు సీతయ్య కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.'నా స్థలంలో నేను షెడ్డు వేసుకుంటే ఫ్యాక్టరీ వాళ్ళు వచ్చి బెదిరించి కూల్చేశారు సార్, నాకు న్యాయం చేయండి' అంటూ రైతు సీతయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఫ్యాక్టరీ నుండి వచ్చే కాలుష్యంతో ఇప్పటికే పంటలు దెబ్బతింటున్నాయని, ఇప్పుడు ఉన్న షెడ్డును కూడా కూల్చేయడంతో తనకు దిక్కెవరూ లేరని వాపోతున్నాడు.ఈ ఘటనపై స్థానిక రైతులు, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి, రైతుకు న్యాయం చేయాలని, ఫ్యాక్టరీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# మత సామరస్య దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

**ప్రజాస్వామ్యం,రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలి: ముప్పాళ్ల**



**గుంటూరు:** సెప్టెంబర్ 15 (మనం న్యూస్ ప్రతినిధి) అక్టోబర్ 2 గాంధీ జయంతిని మత సామరస్య దినోత్సవంగా నిర్వహించి జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.గుంటూరు మల్లయ్యలింగం భవన్లో మంగళవారం ఆరేటి రామారావు అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.సిపిఐ జాతీయ సమితి నిర్ణయాల మేరకు అక్టోబర్ 2 గాంధీ జయంతి, నవంబర్ 7 అక్టోబర్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా సదస్సులు, రౌండ్టేబుల్ సమావేశాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని అన్ని స్థాయిల్లో సమాయత్తం చేయాలని,ప్రజా సమస్యలపై విస్తృతంగా ఉద్యమాలు చేపట్టాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు.భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న విభజనవాద రాజకీయాల నుంచి దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మత సామరస్యం, లౌకిక విలువలను పరిరక్షించేందుకు ప్రజలు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఇళ్లులేని నిరుపేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇవ్వడంతోపాటు ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.ఓటర్ల జాబితాల సవరణ పేరుతో రాష్ట్రంలో లక్షలాది మంది, దేశవ్యాప్తంగా కోట్లాది మంది అమాయకుల ఓట్లను తొలగించడం క్షమించరాని చర్య అని అన్నారు. ఓటు హక్కు పరిరక్షణకు ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సిపిఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఇళ్ల స్థలాల సమస్యపై ఈనెల 22వ తేదీ నుంచి జిల్లాలోని పలు కేంద్రాల్లో లబ్ధిదారుల సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. గుంటూరు నగరంతోపాటు జిల్లాలోని పలు పట్టణాల్లో 22ఏ కింద ఉన్న భూముల్లో నివసిస్తున్న పేదలకు, పోరంబోకు భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# గుంటూరు నగరపాలక సంస్థలో 76 డివిజన్లుగా పెంపు



గుంటూరు నగరపాలక సంస్థ సెప్టెంబర్:15 (మనం న్యూస్ ప్రతినిధి): గుంటూరు నగరపాలక సంస్థ డివిజన్ల పెంపుకి ఆమోదం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం!డివిజన్లను 57 నుంచి 76కు పెంచుతూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ఏపీ ప్రభుత్వం.76 డివిజన్లకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలు.నోటిఫికేషన్ ఏపీ గెజిట్ వెబ్సైట్ లో అందుబాటులో ఉందని తెలిపిన కమిషనర్ కె.మయూర్ అశోక్



# గణపతి ఆశీస్సులు... అందరిపై ఉండాలి



## సాగర తీర మహాగణపతిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మంగినపూడి సాగర తీరంలో 63 అడుగుల సప్తమృత్తిక విజయగణపతికి ప్రత్యేక పూజలు

(విజయవాడ, మనం బ్యూరో): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మంగళవారం మంగినపూడి సాగర తీరంలో ఏర్పాటు చేసిన మహాగణపతి ఉత్సవాలకు హాజరై 63 అడుగుల సప్తమృత్తిక విజయగణపతిని దర్శించుకున్నారు. విజయవాడ నుంచి మంగళవారం సాయంత్రం రోడ్డు మార్గంలో మంగినపూడి బీచ్కు చేరుకున్న గవర్నర్కు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర గవర్నర్, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని విజయగణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు గవర్నర్కు ఆశీర్వచనాలు అందించారు.మంగినపూడి సాగర తీరంలో నిర్వహిస్తున్న మహాగణపతి ఉత్సవాల విశేషాలను గవర్నర్కు నిర్వాహకులు వివరించారు. 63 అడుగుల సప్తమృత్తికతో రూపొందించిన విజయగణపతి విగ్రహాన్ని గవర్నర్ ఆసక్తిగా పరిశీలించారు. గవర్నర్ పర్యటన సందర్భంగా రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, పెడన, పామర్రు, గుడివాడ నియోజకవర్గాల శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీమ్ బేగ్ బందరు ఆర్డీవో కే సాంబశివరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ చలమలశెట్టి నరసింహారావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు, కార్యక్రమ నిర్వహణ కోఆర్డినేటర్ డిఆర్డిఏ పిడి హరిహరనాథ్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు మంగినపూడి బీచ్ వద్ద గవర్నర్కు స్వాగతం పలికారు.విజయగణపతి దర్శనం, ప్రత్యేక పూజల అనంతరం గవర్నర్ మంగినపూడి నుంచి రోడ్డు మార్గంలో విజయవాడకు తిరుగు ప్రయాణమయ్యారు.

















# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సరికొత్త విద్యా విప్లవం



▸▸ మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు,అమరావతి, సెప్టెంబర్,15 ,(మనం ప్రతినిధి):** నిడదవోలు పట్టణంలోని ఎస్.వి.డి. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్' (పీఎం-ఉషా) నిధులు రూ.3.60 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణంలో సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసి నమస్కరించారు. ఈ సందర్భంగా కళాశాలకు విచ్చేసిన మంత్రి దుర్గేష్ కు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు,విద్యార్థినులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ఈ నూతన భవనంలో 100కు పైగా కంప్యూటర్లతో కూడిన కంప్యూటర్ ల్యాబ్ను, డిజిటల్ విద్యకు కావలసిన ప్రత్యేక తరగతి గదులను ఏర్పాటు చేశాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతో మంజూరైన పీఎం-ఉషా పథకం కింద ఎస్.వి.డి. కళాశాలకు మొత్తం రూ.5 కోట్ల నిధులు కేటాయించాం. అందులో రూ.3.60 కోట్లతో భవన నిర్మాణం, మిగిలిన రూ.1.40 కోట్లతో సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, మౌలిక వసతులు మరియు బాలికల కోసం 18 అత్యాధునిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశాం. ఈ నిధుల్లో కేంద్రం 60 శాతం ఇస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాను అందిస్తోంది. మారుమూల ప్రాంతాల విద్యార్థులు కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్వాంటం కంప్యూటింగ్ వంటి అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలనేది ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ల ఆకాంక్ష. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ను సాంకేతికంగా అగ్రస్థానంలో నిలిపిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడిదే అన్నారు. కార్యక్రమంలో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న విద్యార్థినిని మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. చదువుతో పాటు నిగూఢంగా ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీసినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధిస్తారని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థినులు ఎంతటి ఉన్నత స్థానాలకు ఎదిగినా తాము చదివిన కళాశాల అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు.

# ఉద్యోగాలడిగితే.. నిఘా పెడతారా?

▸▸ ప్రశ్నించే యువతను నేరస్తులుగా చూడటం సరికాదు

▸▸ ఇది ప్రభుత్వ అసహనానికి నిదర్శనం కాదా..!

▸▸ ఇది ప్రజాస్వామ్యమా.. నిఘా రాజ్యమా?




**అనంతపురం, సెప్టెంబర్ 15,(మనం న్యూస్):** ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ వంటి హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న యువతను లక్ష్యంగా చేసుకుని నిఘా వ్యవస్థను నడుపుతున్నారంటూ వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని, ఆ హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థులు, నిరుద్యోగులను నేరస్తులుగా చిత్రీకరించడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆయన విమర్శించారు. మంగళవారం అనంతపురంలో మీడియాతో మాట్లాడిన రమేష్ గౌడ్.. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం తన హామీలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగాల కోసం, జాబ్ క్యాలెండర్ కోసం, నిరుద్యోగ భృతి కోసం యువత ప్రశ్నిస్తే వారికి సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం.. వారిపై నిఘా పెట్టడం, వారి కార్యకలాపాలను గమనించడం వంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించడం ఆందోళన కలిగించే విషయమన్నారు.

## యువత డిజిటల్ కార్యకలాపాలపై నిఘా?

స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, సైబర్ విభాగాల పేరుతో నిరుద్యోగ యువతకు సంబంధించిన డిజిటల్ నెట్వర్క్ను మ్యాపింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని రమేష్ గౌడ్ పేర్కొన్నారు. నిరుద్యోగులు చురుగ్గా ఉండే వాట్సాప్ గ్రూపులు, గ్రూప్ అడ్మిన్ల వివరాలు, సందేశాల వ్యాప్తి, సోషల్ మీడియా కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారనే సమాచారం తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న డిజిటల్ గొంతులను నియంత్రించేందుకే ఇటువంటి చర్యలు జరుగుతున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ప్రభుత్వం తమపై వస్తున్న విమర్శలకు సమాధానం చెప్పడం మానేసి, ప్రశ్నించే గొంతులపై నిఘా పెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.

## పోలీసు వ్యవస్థను దేనికి ఉపయోగించాలి?

శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం పనిచేయాల్సిన పోలీసు వ్యవస్థను రాజకీయంగా ప్రశ్నించే యువతను పర్యవేక్షించేందుకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు నిజమైతే అది అత్యంత ఆందోళనకరమైన పరిణామమని రమేష్ గౌడ్ అన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే ప్రతి వ్యక్తిని ప్రత్యర్థిగా చూడటం, ప్రశ్నించే ప్రతి యువకుడిని అనుమానాస్పద వ్యక్తిగా చూడటం సరికాదన్నారు. ప్రజల సమస్యలను వినడం, వాటికి పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు.

## హామీలు ఎక్కడ.. సమాధానాలు ఎక్కడ?

ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది యువతకు భరోసా కల్పించాల్సిన సమయంలో వారి ఫోన్లు, సోషల్ మీడియా కార్యకలాపాలు, నిరసనలపై దృష్టి పెట్టడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. యువత ఫోన్లలోకి తొంగిచూడడం కాదు.. వారి భవిష్యత్తులోకి ప్రభుత్వం చూడాలి. ఉద్యోగ అవకాశాలు ఎప్పుడు కల్పిస్తారో, జాబ్ క్యాలెండర్ ఎప్పుడు విడుదల చేస్తారో, నిరుద్యోగ భృతి హామీ పరిస్థితి ఏమిటో ముఖ్యమంత్రి స్పష్టమైన సమాధానం చెప్పాలి అని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. పశ్నించే యువతను భయపెట్టడం ద్వారా నిరుద్యోగ సమస్యను దాచిపెట్టలేరని, నిఘాలతో యువత గొంతును అణచివేయడం సాధ్యం కాదని ఆయన అన్నారు. ప్రభుత్వం తక్షణమే యువతతో చర్చించి, ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన హామీనివ్వాలని డిమాండ్ చేశారు.

# ధవళేశ్వరం ఆనకట్టపై పునరుద్ధరించిన 'వశిష్ట మహర్షి', 'సర్ ఆర్థర్ కాటన్' విగ్రహ దిమ్మెలను పరిశీలించిన మంత్రి కందుల దుర్గేష్

▸▸ **గోదావరి పవిత్రతకు నిదర్శనమైన వశిష్ట మహర్షి విగ్రహాన్ని, డెల్టా రాతను మార్చిన సర్ ఆర్థర్ కాటన్ మహనీయుని విగ్రహ దిమ్మెలను పునరుద్ధరించడం సంతోషకరం: మంత్రి కందుల దుర్గేష్**



నిడదవోలు,అమరావతి, సెప్టెంబర్, 15,(మనం ప్రతినిధి): ధవళేశ్వరం కాటన్ ఆనకట్ట (విజ్జేశ్వరం ఆర్మ్) పై దశాబ్దాల కాలంగా ఒరిగిపోయి, కూలిపోయే ప్రమాదకర స్థితిలో ఉన్న 'వశిష్ట మహర్షి' విగ్రహ దిమ్మెను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాల మేరకు జలవనరుల శాఖ అధికారులు పూర్తిగా తొలగించి, ఆ స్థానంలో నూతన విగ్రహ దిమ్మెను పునర్నిర్మించారు. మంగళవారం నిడదవోలు పర్యటనకు వెళ్తున్న సందర్భంలో మంత్రి కందుల దుర్గేష్ గారు కాటన్ బ్యారేజ్ వద్ద ప్రత్యేకంగా ఆగి అధికారులు అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పునర్నిర్మించిన వశిష్ట మహర్షి విగ్రహాన్ని, నూతన దిమ్మెను స్వయంగా పరిశీలించారు. దీనితో పాటు, పక్కనే ఉన్న సర్ ఆర్థర్ కాటన్ విగ్రహ దిమ్మెకు చేపట్టిన మరమ్మతు పనులు కూడా పూర్తి కావడంతో ఆ నిర్మాణాన్ని కూడా మంత్రి దుర్గేష్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గోదావరి పవిత్రతకు నిదర్శనమైన వశిష్ట మహర్షి విగ్రహాన్ని, డెల్టా రాతను మార్చిన సర్ ఆర్థర్ కాటన్ మహనీయుని విగ్రహ దిమ్మెలను పునరుద్ధరించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. స్పందించి స్వల్ప కాలంలోనే పునర్నిర్మాణ, మరమ్మతు పనులను నాణ్యతతో పూర్తి చేసిన జలవనరుల శాఖ అధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు.

# హోటల్ వసంత్ మార్గలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలపై ఆకస్మిక తనిఖీ

▸▸ వారం రోజుల లోపు అగ్నిమాపక పరికరాలు పూర్తిస్థాయిలో పని చేయాలి

▸▸ లేనిచో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్న సిబ్బంది

**విజయవాడ,సెప్టెంబర్, 15,(మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం రీజినల్ ఫైర్ ఆఫీసర్ సి.హెచ్. రత్నబాబు తమ సిబ్బందితో కలిసి లబ్బీపేటలోని హోటల్ వసంత్ మార్గలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హోటల్కు ఫైర్ ఎన్ఓసీ (అగ్నిమాపక అనుమతి పత్రం) లేదని గుర్తించారు. అదేవిధంగా, హోటల్లో అందుబాటులో ఉన్న కొన్ని అగ్నిమాపక పరికరాలు సైతం పనిచేయని స్థితిలో ఉన్నట్లు అధికారులు గమనించారు. ఈ నేపథ్యంలో హోటల్ యాజమాన్యానికి వారం రోజుల గడువు విధించి, ఆలోగా అవసరమైన అగ్నిమాపక భద్రతా చర్యలను పూర్తిచేయాలని, అన్ని ఫైర్ సేఫ్టీ పరికరాలను పనిచేసే స్థితిలో ఉంచాలని ఆదేశించారు. జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతంలో హోటల్ నిర్వహిస్తున్నందున అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. నిర్ణయించిన గడువులోగా లోపాలను సరిదిద్దకపోతే నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోటల్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



## వినియోగదారుల హక్కుల పరిరక్షణకు మరింత విస్తృతంగా పనిచేస్తా: కర్లపాటి



- 16వ జాతీయ వినియోగదారుల సదస్సులో సత్కారం
- సి సి సి పూర్తి సభ్యత్వానికి ప్రతిపాదన పరిశీలనలో

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 15 మనం న్యూస్:వినియోగదారుల హక్కుల పరిరక్షణ, ప్రజల్లో వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించడం కోసం తాను చేస్తున్న సేవలను మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని సామాజిక కార్యకర్త, కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పుట్టపర్తిలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు పౌరసరఫరాల శాఖ మరియూ క్యాప్కో ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ జాతీయ వినియోగదారుల సదస్సులో తనను వినియోగదారుల హక్కుల పరిరక్షణ రంగంలో అందిస్తున్న సేవలను గుర్తిస్తూ తనకు జరిగిన సత్కారం వినియోగదారుల హక్కుల పరిరక్షణలో తాను చేస్తున్న కృషికి గుర్తింపు లభించిందని సంతోషం కలిగిందని అలానే తన బాధ్యతలను మరింత పెంచింద న్నారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సి సి సి), న్యూఢిల్లీ జాతీయ చైర్మన్ అభిషేక్ శ్రీవాస్తవ, క్యాప్కో ఆంధ్రప్రదేశ్ గౌరవ అధ్యక్షులు ఎం. నాగేశ్వరరావు, పూర్వపు అధ్యక్షులు కృష్ణారెడ్డి, గౌరీశంకర్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు, పలు రాష్ట్రాల వినియోగదారుల సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంచుతూ, వినియోగదారుల సమస్యలకు చట్టబద్ధమైన పరిష్కారాలు లభించేలా తన సేవలను కొనసాగిస్తానని కర్లపాటి స్పష్టం చేశారు. ముఖ్యంగా వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులు, పొందే సేవల విషయంలో నాణ్యత, ధర, బిల్లులు, వారంటీ, హక్కులు వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించడం అవసరమన్నారు. సిసిసి పూర్తి సభ్యత్వానికి ప్రతిపాదనపరిశీలనలో జాతీయ స్థాయిలో వినియోగదారుల హక్కుల కోసం పనిచేస్తున్న కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సి సి సి), న్యూఢిల్లీ లో తనను పూర్తి సభ్యుడుగా తీసుకోవాలనే ప్రతిపాదన ప్రస్తుతం పరిశీలనలో ఉందని ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన అవసరమైన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయినట్లు తెలిపారు త్వరలో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా కర్లపాటి వెంకట శ్రీనివాసరావును డాక్టర్ అనిల్ కుమార్, ఎం మురళీ, రాయపూడి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు సామాజిక కార్యకర్తలు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, మిత్రులు అభినందించారు.

## ఘనంగా ప్రత్తిపాడులో ఒంగోలు జాతి బండలాగుడు బల ప్రదర్శన కార్యక్రమం ప్రారంభం



గుంటూరు పత్తిపాడు సెప్టెంబర్ 15 (మనం న్యూస్ ప్రతినిధి) వినాయక చవితిని పురస్కరించుకొని ప్రత్తిపాడు మండల కేంద్రంలో నందమూరి తారక రామారావు మెమోరియల్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి బండలాగుడు బల ప్రదర్శనలో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ ,తో కలిసి పాల్గొన్న ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా.బూర్ల రామాంజనేయులు.ఈ సందర్భంగా స్వర్గీయ నందమూరి తారకరామారావు, విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించి, ఎన్టీఆర్ మెమోరియల్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి బండలాగుడు బల ప్రదర్శనను ఎమ్మెల్యే రామాంజనేయులు , ఎంపీ రామకృష్ణ ఘనంగా ప్రారంభించారు. అనంతరం శాసనసభ్యులు వారు మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ మెమోరియల్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి బండలాగుడు బల ప్రదర్శనను ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ,చేతుల మీదుగా ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని, ప్రతి సంవత్సరం వినాయక చవితి తర్వాత రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతుందని,అన్న నందమూరి తారక రామారావు,ఆశయం రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అనే బావనకు ప్రతీకగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు. నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని 360 డిగ్రీలలో ఆధుకోవాలి, రైతులకు వెన్నంటే ఉండాలనే ఆలోచన సీఎం చంద్రబాబు దని, రాష్ట్రాన్ని అభివృద్ధి మరియు సంక్షేమంలో ముందుకు సాగుతున్న చంద్రబాబు, నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం సంతోషమని, ఒంగోలు జాతి అంతరిస్తున్న తరుణంలో, ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు మరియు తదితరులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.

## కట్టుబడివారిపాలెంలో రూ.2.33 కోట్లతో కరివేపాకు ప్రాసెసింగ్ ప్లాంట్కు శంకుస్థాపన చేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



పల్నాడు చిలకలూరిపేట సెప్టెంబర్ :15 (మనం న్యూస్ ప్రతినిధి) పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండలంలో క్లస్టర్ల ద్వారా ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటు మహిళలు కేవలం రుణాలు తీసుకోవడానికే పరిమితం కాకూడదు, పరిశ్రమల యజమానులుగా మారాలి.గ్రామీణ ప్రాంత మహిళలు కేవలం చిన్న చిన్న రుణాలకే పరిమితం కాకుండా, సొంతంగా పరిశ్రమలు స్థాపించి యజమానులుగా ఎదగాలనే ఆశయంతో పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం, కట్టుబడివారిపాలెం గ్రామంలో రూ.2.33 కోట్ల వ్యయంతో కరివేపాకు (కర్రీ లీవ్స్) ప్రాసెసింగ్ ప్లాంట్కు శంకుస్థాపన చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు , చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ముఖ్య అతిథులుగా హాజరై భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ. కట్టుబడివారిపాలెం, చుట్టుపక్కల ప్రాంతాల్లో రైతులు వందలాది ఎకరాల్లో కరివేపాకు సాగు చేస్తున్నారని, వారికి ఆర్థికంగా మరింత చేయూత నందించడానికే ఈ ప్రాసెసింగ్ ప్లాంట్ను తీసుకువచ్చామని ఎంపీ తెలిపారు.మహిళలు ఈ ప్లాంట్ను వేరొకరిదిగా కాకుండా 'మన సొంత పరిశ్రమ' అనే భావనతో, ఐక్యతతో నడిపి లాభాల బాట పట్టించాలని పిలుపునిచ్చారు. రైతులు కరివేపాకును నేరుగా తక్కువ ధరకు అమ్ముకోవడం కంటే, పాలు- పెరుగుగా మార్చి అమ్మినట్టు విలువ పెంచి పౌడర్లు, మసాలాలు తయారు చేసి విక్రయిస్తే ఐదారు రెట్ల అదనపు రాబడి లభిస్తుందని వివరించారు. 'అరకు కాఫీ' బ్రాండింగ్ ద్వారా అంతర్జాతీయ స్థాయికి ఎలా వెళ్ళిందో, అలాగే 'స్వయం' బ్రాండింగ్ ద్వారా మన ప్రాంత ఉత్పత్తులను కూడా మార్కెటింగ్ చేసుకోవచ్చని సూచించారు.ఈ ప్లాంట్ స్థాపన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రుణం, సబ్సిడీ అందించడమే కాకుండా,ఉచిత స్థలాన్ని, తక్కువ వ్యయంతో యంత్రాలు, షెడ్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.నియోజకవర్గవ్యాప్తంగా 28 మండలాల్లో క్లస్టర్ల ద్వారా ఇటువంటి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని, మహిళా సంఘాల సభ్యులు ఒకే తాటిపై నిలిచి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కోరారు.

## ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి భూమిపూజకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు



గుంటూరు తుళ్లూరు సెప్టెంబర్: 15 (మనం న్యూస్ ప్రతినిధి) సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్.తుళ్లూరు మండలం అబ్బురాజుపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఉ-03 రోడ్ (ఖ్చిఛీ అఛిఛ్చిటు ఖ్చొఛీ) -ా-14 జంక్షన్ వద్ద సర్వే నంబర్లు 51, 52, 55లో సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి నిర్మాణం చేపట్టనున్నారు.ఆసుపత్రి నిర్మాణ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా 23.09.2026న నిర్వహించనున్న భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హాజరు కానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా, ట్రాఫిక్ మరియు ఇతర ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ ఈ రోజు మధ్యాహ్నం 04:35 గంటలకు అబ్బురాజుపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రికి కేటాయించిన స్థలాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు కార్యక్రమం జరిగే ప్రదేశం, ముఖ్యమంత్రి రాకపోకల మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, బందోబస్తు విధులు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు తదితర అంశాలపై పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ సమీక్షించారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టి, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు. గుంటూరు జిల్లా వకుల్ జిందాల్, ఐపీఎస్,గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ రవికుమార్ (ఔ) తుళ్లూరు ఎస్ డి పి ఓ మురళీకృష్ణ, గుంటూరుఎస్ బి డి.ఎస్.పి శ్రీనివాస్,గుంటూరు మల్లికార్జున రావు, గుంటూరు శ్రీనివాసరావు తుళ్లూరు పోలీస్ స్టేషన్ వాసు , తుళ్లూరు పోలీస్ స్టేషన్ కోటేశ్వరరావు,తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,క్రాంతి కిరణ్ - తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,ముఖ్యమంత్రి. పర్యటనను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ భద్రతా,ట్రాఫిక్ ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నట్లు జిల్లా పోలీస్ అధికారులు తెలిపారు.

## సమాజ ప్రగతిలో ఇంజినీర్ల పాత్ర కీలకం



విజయవాడ,సెప్టెంబర్, 15,(మనం న్యూస్): దేశ నిర్మాణం, సాంకేతిక అభివృద్ధి, సమాజ పురోగతిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని డా. ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. పులాల చంద్రశేఖర్, రిజిస్ట్రార్ సాయి సుధీర్ పేర్కొన్నారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని నిర్వహించే ఇంజినీర్స్ డే సందర్భంగా విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని, ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఇంజినీరింగ్ రంగానికి ఆయన చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్న ఇంజినీర్లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. వీసీ డా. పులాల చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దూరదృష్టి, క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యం దేశ అభివృద్ధికి చిరస్మరణీయమైన సేవలను అందించాయని అన్నారు. ఆయన చూపిన మార్గం నేటి ఇంజినీర్లకు ఆదర్శమని పేర్కొన్నారు. ఇంజినీర్లు తమ సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న ఆలోచనలతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ దేశ నిర్మాణంలో కీలక భాగస్వాములుగా నిలుస్తున్నారని అన్నారు. రిజిస్ట్రార్ సాయి సుధీర్ మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణంలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన అంకితభావం, కార్యదక్షత, ఇంజినీరింగ్ ప్రతిభ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల అవసరాలకు అన్వయిస్తూ సమాజానికి మెరుగైన పరిష్కారాలను అందించడంలో ఇంజినీర్ల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా డా. పులాల చంద్రశేఖర్, సాయి సుధీర్ విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్న ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి, మౌలిక వసతుల నిర్వహణ, రోజువారీ కార్యకలాపాలు సజావుగా సాగడంలో వారి కృషి, నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ఇంజినీర్లు తమ జ్ఞానం, నైపుణ్యాన్ని సమాజ శ్రేయస్సు, దేశాభివృద్ధికి వినియోగించాలని వీసీ, రిజిస్ట్రార్ ఆకాంక్షించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్, సాంకేతిక సిబ్బందితో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# సర్-2026 ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

- కృష్ణా రోల్ అబ్జర్వర్ సి.హెచ్. శ్రీధర్
- ముసాయిదా జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల మేరకు పరిష్కరించాలి
- 97.37 శాతం హియరింగ్స్ పూర్తి..
- పెండింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి

మచిలీపట్నం, సెప్టెంబర్ 15,(మనం న్యూస్): కృష్ణా జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 (సర్) ప్రక్రియలో పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి, నిర్దేశిత కాలపరిమితిలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని కృష్ణా జిల్లా రోల్ అబ్జర్వర్, మైనారిటీస్ వెల్ఫేర్ శాఖ ప్రభుత్వ కార్యదర్శి సి.హెచ్. శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లో నిర్వహించిన సమీక్షలో జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, డీఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. జూలై 31న ప్రచురించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 14,05,580 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వివరించారు. సర్ ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 15 నాటికి 1,09,953 నోటీసులు జారీ/డెలివరీ చేయగా, 1,07,060 హియరింగ్స్ పూర్తయ్యాయి. దీంతో 97.37 శాతం హియరింగ్స్ పూర్తికాగా, 2,893 హియరింగ్స్ మాత్రమే పెండింగ్లో ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేయాలని రోల్ అబ్జర్వర్ ఆదేశించారు. ఫారం-6 దరఖాస్తుల్లో అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని, ఫారం-7 దరఖాస్తులను క్షేత్రస్థాయి ధృవీకరణతోనే పరిష్కరించాలని సూచించారు. మరణించిన, శాశ్వతంగా తరలిపోయిన, డూప్లికేట్ ఓటర్లను నిబంధనల ప్రకారం గుర్తించడంతో పాటు, అర్హులైన ఏ ఓటరు పేరు అనవసరంగా తొలగించకూడదని స్పష్టం చేశారు. ఫారం-8 ద్వారా వచ్చిన చిరునామా మార్పులు, ఇతర సవరణలను కూడా సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీలు పరిశీలించి, పేర్లు, చిరునామాలు, ఫొటోలు, మరణించిన లేదా తరలిపోయిన ఓటర్లు, డూప్లికేట్ ఎంట్రీల్లో లోపాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని రోల్ అబ్జర్వర్ కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ స్టేషన్ల నిర్వహణ, ఓటర్ల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సూచనలు చేశారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, అనర్హమైన ఎంట్రీలను నిబంధనల ప్రకారం తొలగించి ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని రోల్ అబ్జర్వర్ ఆదేశించారు. అనంతరం ఆయన స్థానిక పాండురంగ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులను పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కే సాంబశివరావు, జి బాలసుబ్రమణ్యం, ఎస్ కరుణ కుమారి, ఈఆర్ఓలు, ఏఈఆర్వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.








## గోపి మృతి పై మెజిస్ట్రేరియల్ విచారణ చేపట్టాలి..ముప్పాళ్ళ

**గుంటూరు తాడికొండ సెప్టెంబర్ 15: (మనం న్యూస్ ప్రతినిధి) :** పొన్నెకల్లు గ్రామానికి చెందిన చీకటి గోపి మృతిపై మెజిస్టేరియల్ విచారణ చేపట్టాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు మంగళవారం పొన్నెకల్లు గ్రామంలో గోపి కుటుంబాన్ని సిపిఐ బృందం పరామర్శించింది.మృతికి గల కారణాలను కుటుంబీకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విలేకరులతో ముప్పాళ్ళ మాట్లాడారు.గోపి మృతితో పోషణ దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.గోపి మృతి పై ఒక ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో నిక్సపాక్ష విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.అలాగే మృతుని భార్య జ్యోతి కి ఉద్యోగ వసతి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు సిపిఐ పార్టీ తరపున ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి సిపిఐ పార్టీ తరపున కుటుంబానికి రూ. 5000. ఆర్థిక సహాయం అందజేశారు.మృతుని కుటుంబానికి న్యాయం జరిగే వరకూ సిపిఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, సహాయ కార్యదర్శులు చిన్ని తిరుపతయ్య, మేడా హనుమంతరావు, తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, కౌన్సిల్ సభ్యులు రేపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న రూ.35,000 నగదు బ్యాగ్‌ను గుర్తించి బాధితురాలికి అప్పగించిన లాలాపేట పోలీసులు



పల్నాడు జిల్లా, ఎడ్లపాడు మండలం, చెంఘిజ్ఖాన్పేటకు చెందిన పోలిపోగు సుమ మాధురి 14.09.2026న మధ్యాహ్నం షాపింగ్ నిమిత్తం గుంటూరులోని డీ-మార్ట్కు వచ్చారు. షాపింగ్ అనంతరం డీ-మార్ట్ నుంచి పల్నాడు బస్టాండ్ వరకు ఆటోలో ప్రయాణించి,ఆటోకు డబ్బులు చెల్లించిన అనంతరం రూ.35,000 నగదు ఉన్న బ్యాగ్ను ఆటోలోనే మర్చిపోయారు.వెంటనే ఆమె లాలాపేట పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేయగా,లాలాపేట సీఐ ఏ.వి. శివప్రసాద్ ఆదేశాల మేరకు,ఎస్ఐ సి.హెచ్.ప్రవీణ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు కిరణ్ మరియు శంకర్ సీసీటీవీ ఫుటేజ్లు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సంబంధిత ఆటోను గుర్తించి , నగదుతో కూడిన బ్యాగ్ను సురక్షితంగా స్వాధీనం చేసుకుని, అనంతరం బాధితురాలికి అప్పగించారు.తను పోగొట్టుకున్న నగదు బ్యాగ్ను సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి తక్కువ సమయంలో గుర్తించి తిరిగి అందించిన లాలాపేట పోలీసులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.